# పురాణాలు - పర్యావరణం

దేవరకొండ శేషగిరి రావు

ఎమెస్కో

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | కృతజ్ఞత | 5 |
| 2. | పర్యావరణం – పరిచయం | 7 |
| 3. | ఋగ్వేదంలో సహజ పరిసరవర్ణనం | 18 |
| 4. | అధర్వవేదంలో సహజ పరిసరవర్ణనం | 22 |
| 5. | పురాణాలలో చెట్ల ప్రశంస | 39 |
| 6. | భవిష్యపురాణంలో వృక్ష వైభవం | 57 |
| 7. | పురాణాలలో జీవ సంబంధిత విషయాలు | 64 |
| 8. | పురాణాలలో జంతువులు | 71 |
| 9. | పురాణాలలో పర్వతారణ్యములు | 78 |
| 10. | నదులు – తీర్థాలు – పరిసర సంరక్షణ | 84 |
| 11. | పృథు చక్రవర్తి – భూమిని పిండుట | 88 |
| 12. | శ్రీకృష్ణుడు – పర్యావరణం | 91 |
| 13. | ప్రాణవాయువు | 96 |

# పర్యావరణం - పరిచయం

## పర్యావరణమంటే

పరితః సర్వతః ఆవరణం = ఆచ్ఛాదనం = రక్షాకవచమని అర్థం. పర్యావరణమనగా పరిసరమని అర్థం. ప్రకృతి ప్రాణులకు హితదాయిని. ప్రకృష్టాకృతిః యస్యాః ఇతి విగ్రహః, ప్రకృష్టవాచకశ్చ ప్రశ్చ, కృశ్చ సృష్టి వాచకః. అనగా శ్రేష్ఠమైన సృష్టిని తెలుపునదే ప్రకృతి.

ప్రాణి యొక్క జీవనం పంచతత్వాలచే అనగా పంచ భూతాలచే ఆవరింపబడింది. శరీరమే పంచభూతాలచే ఆవరింపబడింది. ఆ శరీరానికి చుట్టూ పంచభూతాలున్నాయి. ఆ ఆవరణానికి వికారం ఏర్పడితే పర్యావరణం దూషింపబడిందని అంటున్నాం. ఆ ప్రకృతికి వికృతి కలిగితే అంతా వినాశమే.

చేతన, అచేతన పదార్థాల పరిసరంతో కూడి ఉన్నాం. ప్రతిజీవి మరొక జీవి యొక్క సహకారం లేకపోతే మనగలగడం కష్టం. ఒక ప్రాణి మరొక ప్రాణికి ఆహారమై, ఆహార శృంఖల ఎడతెగకుండా సాగుతూనే ఉంటుంది. సూర్యరశ్మి వల్ల పోషింపబడే వృక్షాలను, సస్యాలను పశువులు తినడం, అందొక పశువు మరొక పశువుని తినడం, వాటి మరణం, ఆ మృత కళేబరాలను మరికొన్ని తినడం, సూక్ష్మ క్రిములు భూమిలో చేరడం వాటి వల్ల భూమికి బలం, మరల సస్యోత్పత్తి అనే చక్రం గిరగిరా తిరుగుతూనే ఉంటుంది.

## పర్యావరణ కాలుష్యం

ఇట్లా సాగే ప్రకృతి మన ఎఱుకలోనే మన తరంలోనే అనేక వికారాలకు లోనౌతోంది.

50 సంవత్సరాల వెనుక కర్మాగారాలు విడుదల చేసిన పొగను గాని, మనం విసిరిపారేసిన చెత్తను గాని ప్రకృతి స్వీకరించి జీర్ణించుకొంది. ఈ నాటి పరిస్థితి వేరు. ఈనాడు నగరాలన్నీ కాలుష్యపు కోరలలో చిక్కుకున్నాయి. నదులన్నీ వ్యర్థ పదార్థాలతో, పరిశ్రమలు విడిచిపెట్టే కాలుష్యంతో నిండిపోతున్నాయి. వాహనాల రద్దీ, అవి విడిచిపెట్టే విషవాయువులతో నగరాలు నిండిపోయాయి. గాలిని, నీటిని, నేలను కలుషితం చేస్తున్నాం.

సగటు భారతీయుడు 350 kwh విద్యుత్తును వాడితే, సగటు అమెరికా వ్యక్తి మనకంటె 40 రెట్లు ఎక్కువగా వాడుతున్నాడు. ప్రపంచం మొత్తం జనసంఖ్యలో 20 శాతం మంది 80 శాతం ప్రపంచపు ఉత్పత్తి సాధనాలను వాడుకొంటున్నారు. ఆపైన జనసంఖ్య పెరుగుదల సరేసరి. మనం 100 కోట్లు దాటాం. ప్రతి దశాబ్దానికి 10 కోట్ల జనులు పుడుతున్నారు.

పారిశ్రామికీకరణ ఎక్కువైన కొద్దీ వాతావరణం కలుషితమౌతోంది. కార్బన్‌డై ఆక్సైడ్, మేథేన్ మొ॥ విషవాయువుల వల్ల వాతావరణ సమతుల్యం (Balance) దెబ్బతింటోంది. ఉష్ణోగ్రత పెరిగిపోతోంది. ఫ్రిజ్‌లు, ఎయిర్ కండిషన్ సదుపాయం, మొ॥ ఎన్నో కారణాల వల్ల వర్షపాతంలో ఎగుడు దిగుళ్ళు, మంచు పర్వతాలు కరిగిపోవడంతో సముద్రపు మట్టం పెరగడం, భూమికి 25 లేక 30 కిలోమీటర్ల దూరంలో ప్రాణవాయువనే పొర (ఓజోన్) కు చిల్లులు పడడం, మొ॥ అనేక విపరిణామాలు సంభవిస్తున్నాయి. ఆ ఓజోన్ పొర, సూర్యుని నుండి వెలువడే నీల లోహిత కిరణాలను అడ్డుకొని భూమి కొక రక్షాకవచంలా ఉంటుందని, సైన్సు చదివిన వారికి తెలిసిందే. నాగరికత పేరుతో ప్లాస్టిక్, సిమెంటు అధికంగా వాడకం మొ॥ సంగతులు తెలిసినవే.

అపారమైన ఖనిజ సంపద కొల్లగొట్టబడుతోంది. భూమినుండి సహజవాయువు, పెట్రోలు, బొగ్గువంటి ఖనిజ పదార్థాలను వెలికి తీస్తున్నాం. ఆ భూమిని మరలపూడ్చే పనికి పూనుకోవడం లేదు. నీరును తోడితే వ్యవసాయానికి ఉపయోగపడుతుందని భావించాం. కాని ఈనాడు త్రాగడానికి కటకట పడుతున్నాం. నీరును తోడితే పై నుండి వర్షం పడి నేలలో ఇంకి, మరల నీరు ఉత్పత్తి కావచ్చు. మిగిలిన వాటి మాటేమిటి? గాలి తీసిన బంతిలా భూమి ఉంది. ఎప్పుడు కుప్ప కూలుతుందో తెలియని స్థితి. భూకంపాలు, సునామీలు, అతివృష్టులు, అనావృష్టులు ఇట్లా ఎన్నిటినో అనుభవిస్తున్నాం. అడవులను విచ్చలవిడిగా నరికి వేస్తున్నాం. నదిలో ఇసుక ఉంటే భూగర్భ జలానికి ఆధారమౌతోంది. దీనిని అక్రమంగా రవాణా చేస్తున్నాం. ఇవన్నీ మనకు తెలిసిన సంగతులే. పత్రికలు చదివేవారికి, దూరదర్శన్ వీక్షించే వారికి అన్నీ తెలుసు. మన భారత దేశంలో మొత్తం ప్రపంచంలో 15-20 శాతం వరకు మొక్కల జాతులున్నాయి. 13 శాతం పక్షులున్నాయి. 5 శాతం మాత్రమే జీవరసాయనాల ఉత్పత్తి ఉంది. ఇదంతా ప్రపంచంలోని రెండు శాతం నేలమీద మాత్రమే. ఇవీ క్రమ క్రమంగా అంతరించిపోతున్నాయి. నీటినుండి పాలను వేరు చేసే హంసలు గాని, వెన్నెలే ఆహారంగా తిని బ్రతికే చకోర పక్షులు గాని, వర్షపు నీటినే త్రాగే చాతక పక్షులుగాని, ఎనిమిది కాళ్లు ఉండి, సింహాన్ని తినే శరభ మృగంగాని కావ్యాలలో మాత్రమే మిగిలాయి. వాటికి తోడు నేడు పిచ్చుకల మనుగడయే ప్రశ్నార్థకమౌతోంది.

పారిశ్రామికీకరణ పేరుతో వేల ఎకరాల భూమిలో పంటలు లేవు. ఎక్కడినుండి వస్తుంది వస్తూత్పత్తి? బంజరు భూములను పరిశ్రమలకు కేటాయించకుండా ముక్కారు పంటలు పండే పచ్చటి నేలను బీడుభూమిగా మారుస్తున్నారేమిటి?

పారిశ్రామికీకరణ పేరుతో యూరప్ దేశాలలో ప్రకృతినెట్లా ఉపయోగించుకోవాలో పథకాలు రచింపబడ్డాయి. 16వ శతాబ్దంలో ఫ్రాన్సిస్ బేకన్ అనే బ్రిటిష్ తత్త్వవేత్త, ప్రకృతిని బానిసగా చేసికోవాలని, దీనిని అవసరమైతే హింసించియైనా దీని ఉత్పత్తులను పిండి వాడుకోవాలని అన్నాడు.

## వేదం దృష్టిలో ప్రకృతి

ఇట్టి ఆటవిక భావన, ఈ దేశంలో ఏనాడూ పొడసూపలేదు. ఋగ్వేదం భూమిని తల్లిగా, ద్యులోకాన్ని తండ్రిగా భావించింది. ద్యౌర్వః పితా, పృథ్వీమాతా, సోమోభ్రాతా, దితిః స్వసా. అట్లే అథర్వవేదం కూడా. ఆ ప్రకృతి సంతానమే మనమని భావించింది. లేచీ లేవగానే సముద్రమే బట్టగా కలిగిన దానా, పర్వతములే వక్షఃస్థలంగా కలిగిన దానా, ఓ విష్ణుపత్నీ, నీమీద అడుగుపెడుతున్నా క్షమించుమని భూమిని ప్రార్థించడం ఏ దేశంలోనైనా ఉందా? ఏ మతమైనా చెప్పిందా?

భూమిని నానారత్న వసుంధరగా కీర్తించాం. నదీనదాలు, పర్వతాలు, సూర్యుడు, వర్షం, వృక్షాలు, జంతువులు మొ॥ వాటిని అసంఖ్యాకమైన మంత్రాలతో కీర్తించాం.

ప్రకృతి ఇచ్చే సంపదకు జేజేలు పలికాం. ప్రకృతిని జడవస్తువుగా కాక దేవతగా కొలిచాం. పువ్వు నుండి మకరందాన్ని గ్రోలి పువ్వునకు హాని తలపెట్టని తుమ్మెదలా, ఈ సంపదను గ్రహించినపుడు మాత్రమే లోకకల్యాణం, లేదా వినాశనం.

## నేటి పరిస్థితి

ఇంతవరకూ భూమిని క్షమాగుణం ఉన్నట్లు కీర్తించాం. భార్యను ఓర్పు విషయంలో భూమితో పోల్చాం క్షమయా ధరిత్రీ అని. ఆ క్షమను కోల్పోయి క్షోణి, క్షామానికి గురౌతోంది. కృత్రిమమైన ఎరువులు, ఎక్కువ దిగుబడులకై రకరకాల వంగడాలు నాటి చేతులారా కటువును, అనారోగ్యాన్ని ఆహ్వానిస్తున్నాం. తల్లిపాలలో కూడా డి.డి.టి. విష పదార్థపు శాతం కనుగొన్నట్లు పత్రికలలో చదివాం. పాతిక సం॥ వెనుక ఒక రైతు జొన్నల రాశిలో ఆ పదార్థాన్ని కలుపుతూ ఉంటే ఇదేమిటని ప్రశ్నించగా పుచ్చిపోకుండా ఉంటాయని

సమాధానం చెప్పాడు. తినే అన్ని పదార్థాలలో ఎట్లా కృత్రిమ వస్తువులను కలుపుతున్నారో విస్తారంగా వ్రాయనవసరం లేదు.

## కర్తవ్యం

ప్రకృతి మన అవసరాలను తీర్చ గలదు గాని, మన అత్యాశను తీర్చలేదనే గాంధీగారి మాట అక్షరాల సత్యం. కనుక ప్రేమతో, భక్తి భావంతో మనం ప్రకృతి పట్ల ప్రవర్తించ గలిగితే అది సహకరిస్తుంది.

"భూత్యైన ప్రమదితవ్యం" అని వేద సందేశం. అంటే సంపద విషయంలో ప్రమాదాన్ని పొందవద్దని అర్థం. అట్టి సంపదను ప్రకృతి నుండే పొందగలం.

రాష్ట్రం స్థావర జంగమం అనే మాట ఉంది. రాష్ట్రమంటే కేవలం మానవులుండేదే కాదు. సకల స్థావర జంగమాలుండేదే రాష్ట్రం. అనగా కదిలే, కదలని వాటితో ఉండేదే! కనుక మానవుల అభివృద్ధియే కాక మొత్తం స్థావర జంగమాల అభివృద్ధి ఉన్నపుడే కల్యాణం.

మానవుల సంరక్షణ పైఅన్నిటిమీద ఆధారపడిఉంది. కనుకనే ఈ దేశంలో ఇతర జంతువులు, వృక్షలతాదులపై విశేష ఆదరణ చూపబడింది. ధార్మికాచారాల రూపంలో వృక్షలతాదులను దేవతలుగా కీర్తించారు. సమగ్రమైన అరణ్యం వనదేవతగా పూజింప బడింది. వనశంకరిగా పూజలందుకొంది. వృక్షలతాదుల పట్ల పుత్రవాత్సల్యం చూపినట్లు కావ్యాలలో వర్ణనలున్నాయి. చూ.. అభిజ్ఞాన శాకుంతల నాటకం.

ఈనాడు శబ్దకాలుష్యం (ధ్వని కాలుష్యం) జల కాలుష్యం, వాయుకాలుష్యాలతో బాధ పడుతున్నాం. నదులలో వ్యర్థ పదార్థాలను, అందునా, పరిశ్రమల వ్యర్థపదార్థాలను విడవడం, నదులు కలుషితమై పోయాయని కొన్ని వందలకోట్లు ఖర్చుపెట్టి వాటిని శుద్ధి చేయాలనడం మనం వింటున్నదే.

## శ్రీకృష్ణుని దూరదృష్టి

5 వేల సం॥నాడే జలకాలుష్యాన్ని, వృక్ష నాశన ప్రక్రియను ఖండించాడు కృష్ణుడు. కృష్ణుడు అవతారమా కాదా అనే మాటను ప్రక్కన బెట్టినా అతడు చేసిన మంచి పనులను కూడా ఈనాటి కొందరు విద్యావేత్తలు గుర్తించకపోవడం దురదృష్టకరం. కాళీయుని వృత్తాంతం మనకు తెలిసిందే కదా! యమునను, ఆ పాము విషం నుండి రక్షించాడు